న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలి

● బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి

రంగారెడ్డి జిల్లా కోర్టులు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. న్యాయవాదులపై జరుగుతున్న వరుస దాడులను ఖండిస్తూ మంగళవారం రంగారెడ్డి జిల్లా కోర్టులో న్యాయవాదులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం రంగారెడ్డి జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యదర్శి భిక్షమయ్యతో కలిసి వారు మాట్లాడారు. మల్కాజిగిరి, కూకట్‌పల్లి, రాజేంద్రనగర్, రంగారెడ్డి జిల్లా కోర్టులలో తరుచుగా న్యాయవాదులపై దాడులు జరుగుతున్నాయని అన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సత్యనారాయణరెడ్డి, గాల్‌రెడ్డి, అనసూయ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



మహేశ్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న హైదరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్

కామారెడ్డి సభను జయప్రదం చేయాలి

● ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీనివాస్

సైదాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డిలో జరిగే బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీసీలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ బీసీల పక్షపాతి అని అన్నారు. అనంతరం టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్ బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయనను వారి నివాసంలో శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

'విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'

మన్సూరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లక్ష్మీనరసింహరావు కోరారు. అసోసియేషన్ నాగోల్ శాఖ సర్వసభ్య సమావేశాన్ని నాగోల్ డివిజన్‌లోని కోఆపరేటివ్ బ్యాంక్ కాలనీలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 2025-27 అసోసియేషన్ నాగోల్ శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బీవీ ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శిగా అశోక్‌కుమార్‌రావు, ఆర్థిక కార్యదర్శిగా అశోక్, అసోసియేట్ అధ్యక్షుడిగా నరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడిగా ప్రభాకర్‌రెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలిగా శ్రీలేఖ, సంయుక్త కార్యదర్శిగా జగన్నాథం, కార్యనిర్వాహక కార్యదర్శిగా లాలయ్యగౌడ్, ప్రచార కార్యదర్శిగా మహేశ్వరి, గౌరవాధ్యక్షుడిగా వైవీఎం సుబ్బారావులు ఎన్నికైనట్లు అసోసియేషన్ ఎన్నికల అధికారి చక్రయ్య తెలిపారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను అతిథులు అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎల్‌కే జగన్మోహన్‌రావు, కార్యదర్శి జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసు అధికారులను సన్మానిస్తున్న ఉత్సవ సమితి అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి

పోలీసుల సహకారం మరువలేనిది: నిరంజన్‌రెడ్డి

సరూర్‌నగర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో పోలీసుల సహకారం మరువలేనిదని బాలాపూర్ గణేశ్ ఉత్సవసమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి అన్నారు. ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసిన నేపథ్యంలో మంగళవారం ఆయన సమితి ప్రతినిధులతో కలిసి బాలాపూర్ ఎస్‌హెచ్‌వో సుధాకర్, పీఎస్‌లోని ఇతర అధికారులు, సిబ్బందిని సన్మానించి లడ్డూ ప్రసాదం అందజేశారు. అనంతరం నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ, నిత్యం వినాయకుడి దర్శనానికి వచ్చిన లక్షలాది మంది భక్తులను నియంత్రించడంలో పోలీసులు కీలక భూమిక పోషించారన్నారు. ఉత్సవ సమితి ప్రతినిధులు, పోలీసుల పరస్పర సమన్వయం, సహకారంతోనే ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయని ఎస్‌హెచ్‌వో సుధాకర్ అన్నారు.

అధిక నీటి బిల్లులను అరికట్టండి

● వాటర్ వర్క్స్ అధికారులకు సీపీఎం వినతి

హయత్‌నగర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లో నూతనంగా నిర్మించుకున్న గృహాలకు అధిక నీటి బిల్లులు వస్తున్నాయని, వాటిని పరిశీలించి అధిక బిల్లులను అరికట్టాలని సీపీఎం నాయకులు అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం సీపీఎం హయత్‌నగర్ మండల కమిటీ నాయకులు వనస్థలిపురంలోని వాటర్ వర్క్స్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కీసరి నర్సిరెడ్డి మాట్లాడుతూ, కొత్తగా ఇళ్లు నిర్మించుకుని వాటర్ కనెక్షన్ తీసుకున్న వారికి రూ. 1800 నుంచి 2వేల వరకు బిల్లులు వస్తున్నాయన్నారు. తక్షణమే వాటర్ మీటర్లను తనిఖీ చేసి అధికంగా వస్తున్న బిల్లులను అరికట్టాలని ఆయన కోరారు. గతంలోనూ అధిక బిల్లుల విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువచ్చామని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, నరహరి, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి, నాయిని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సంచార విముక్త జాతుల దినోత్సవ పోస్టరును ఆవిష్కరిస్తున్న సంచార జాతుల సంఘం నాయకులు

సంచార విముక్త జాతుల దినోత్సవం పోస్టరు ఆవిష్కరణ

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రవీంద్ర భారతిలో బుధవారం జరగనున్న సంచార విముక్త జాతుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సంచార జాతుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఒంటెద్దు నరేందర్, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇనాంగూడలో వంశరాజ్ సంక్షేమ సంఘం కార్యాలయంలో సంచార విముక్త జాతుల దినోత్సవానికి సంబంధించిన పోస్టరును వారు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సంచార విముక్త జాతుల దినోత్సవ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరవనున్నట్లు తెలిపారు. సంచార జాతుల వర్గానికి చెందిన వారు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు.

స్వచ్ఛ మన్సూరాబాద్‌కు కృషి చేయాలి: కార్పొరేటర్

మన్సూరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ మన్సూరాబాద్‌కు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. జీహెచ్‌ఎంసీ పంపిణీ చేసిన చెత్త సేకరణ రిక్షాలను కాస్మోపాలిటన్ కాలనీలో సిబ్బందికి మంగళవారం కార్పొరేటర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వచ్ఛ భారత్-స్వచ్ఛ హైదరాబాద్ లక్ష్యాన్ని నెరవేర్చడంలో కాలనీవాసులు కూడా తమ వంతు సహకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటేషన్ డీఈ నీలిమ, జవాన్ శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఏ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. ప్రసాద్



కాళోజీ చిత్ర పటం వద్ద పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి

కాళోజీ జీవితం స్ఫూర్తిదాయకం

● మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి

హయత్‌నగర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాకవి కాళోజీ నారాయణరావు జీవితం భావి తరాలకు స్ఫూర్తిదాయకమని తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి అన్నారు. కాళోజీ 111వ జయంతిని పురస్కరించుకుని తుర్కయంజాల్ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆయన చిత్ర పటానికి కమిషనర్ అమరేందర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్షరాన్ని ఆయుధంగా మలిచి నిరంకుశ పాలనను ఎదురించిన గొప్ప వ్యక్తి కాళోజీ అని కొనియాడారు. పోరాటమే పరమావధిగా చేసి తెలంగాణ విముక్తికి సహకరించిన మహానేత అని అన్నారు. కాళోజీ కవితలు తెలంగాణ సమాజాన్ని మేల్కొల్పాయని కమిషనర్ అన్నారు. కాళోజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి యువకుడిపై ఉందన్నారు. ఆయన జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహించడం సంతోషించదగ్గ విషయమన్నారు. ప్రతి సంవత్సరం ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ భిక్షపతి, ఏఈ చంద్రశేఖర్ రెడ్డి, టీపీఓ దినేష్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ వనిత, ఇన్‌చార్జి ఆర్ఐ వినయ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాళోజీ జయంతి..

సరూర్‌నగర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను మంగళవారం బడంగ్‌పేట్‌లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు భాష అభివృద్ధికి కాళోజీ కృషి చేశారని కొనియాడారు. తెలంగాణ మాండలికానికి ఆయన నిలువెత్తు నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.రాజ్‌కుమార్, లెక్చరర్లు విజయశ్రీ, నరసింహరాజ్, డా.వెంకటరెడ్డి, డా.రామ్‌రాజ్, డా.కిరణ్మయి, సురేశ్, సుస్మిత, సురేందర్, రోహిత్‌కుమార్, వెంకన్న, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు వెంకటరెడ్డి, జ్యోతి, రేవతి తదితరులు పాల్గొన్నారు.



కాళోజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ కదివరన్ తదితరులు

సామాజిక చైతన్య స్ఫూర్తి 'కాళోజీ'

● అదనపు కలెక్టర్ కదివరన్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమం, రజాకార్ల వ్యతిరేక పోరాటంలో ప్రజాకవి కాళోజీ నారాయణ రావు భాగస్వామ్యం చాలా గొప్పదని అదనపు కలెక్టర్ కదివరన్ అన్నారు. వివిధ అంశాలపై ఆయన ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని నింపారని గుర్తుచేశారు. కాళోజీ నారాయణరావు 111వ జయంతిని కలెక్టరేట్‌లో మంగళవారం అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అదనపు కలెక్టర్ కదివరన్ మాట్లాడుతూ.. తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ, కన్నడ, ఇంగ్లిష్ భాషల్లో సమాన ప్రావీణ్యం కలిగిన కాళోజీ తన కవిత్వం ద్వారా సామాజిక సమస్యలు, ప్రజల కష్టాలు, పోరాటాలు, ఆశయాలను ప్రతిబింబించారని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ముకుందరెడ్డి, డీఆర్‌ఓ వెంకటాచారి, బీసీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఆశన్న, గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటాజీ, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసా

● ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

హయత్‌నగర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైద్య ఖర్చులు భరించలేని నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ భరోసా కల్పిస్తోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, తుర్కయంజాల్ మున్సిపాలిటీకి చెందిన 22 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 22 మంది లబ్ధిదారులకు రూ.9.27లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. అనారోగ్యానికి గురై వైద్యం చేయించుకునే స్తోమత లేని ఎంతోమంది పేదలు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం పొంది ఆరోగ్యంగా జీవిస్తున్నారన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారు సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి సీఎంఆర్ఎఫ్ అందేలా చూస్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ భాస్కరాచారి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌గౌడ్, మాజీ సర్పంచులు కందాళ రంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కిషన్, నాయకులు వెంకట్‌రెడ్డి, మూల కిరణ్‌గౌడ్, అంతటి ధన్‌రాజ్‌గౌడ్, రాజునాయక్, రాగ్యానాయక్, అశోక్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

'వాటర్ సంపును శుభ్రం చేయండి'

సరూర్‌నగర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ జడ్పీ హైస్కూల్ ఆవరణలోని వాటర్ సంపులో నీరు అపరిశుభ్రంగా మారిందని, వెంటనే సంపును శుభ్రం చేయాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. సంపు అపరిశుభ్రంగా మారిందని బీజేపీ నేతలు సోమవారం ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. స్పందించిన బడంగ్‌పేట్ మున్సిపల్ అధికారులు సంపును మంగళవారం పరిశీలించి ఇనుప జాలీ ఏర్పాటు చేశారు. బీజేపీ క్లస్టర్-1 అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి పలువురు నేతలతో కలిసి సంపును పరిశీలించి జాలీ ఏర్పాటు చేస్తే సరిపోదని, వెంటనే సంపును శుభ్రం చేయాలని డిమాండ్ చేశారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

● ఎమ్మెల్యే అహ్మద్ బలాల

చాదర్‌ఘాట్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట నియోజకవర్గ అభివృద్ధియే తన ధ్యేయమని ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. మలక్‌పేట నియోజకవర్గంలో కొత్తగా మంజూరైన రూ.15కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 ఈఈ కవిత, డిప్యూటీ ఈఈ ప్రజ్ఞ, ఏఈలు మల్లికార్జున్, మోబిన్, వెంకన్న, శరత్‌రెడ్డిలతో నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అహ్మద్ బలాల మాట్లాడారు. మలక్‌పేట నియోజకవర్గంలోని ఆరు డివిజన్లలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.15కోట్లు మంజూరయ్యాయని, ఈ నిధులతో 88 పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఒక్కో డివిజన్‌లో స్థానిక అవసరాల మేరకు రూ.2-3కోట్లు మంజూరు చేయించినట్లు చెప్పారు. అభివృద్ధి పనులకు టెండర్ల ప్రక్రియ దాదాపుగా పూర్తయిందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు.

మేధా సంపత్తిని సమాజాభివృద్ధికి వినియోగించాలి

● రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలక్రిష్ణారెడ్డి

● ఎంవీఎస్ఆర్ కాలేజీలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

సరూర్‌నగర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులు తాము అభ్యసించిన విద్యను, విజ్ఞానాన్ని, మేధస్సును సమాజాభివృద్ధికి వినియోగించాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ.బాలక్రిష్ణారెడ్డి సూచించారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ నాదర్‌గుల్‌లోని ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, ఇంజనీరింగ్ చేసిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చే అవకాశముండదని, ప్రైవేటు సెక్టార్‌లో ఉద్యోగాలపై దృష్టి పెట్టాలని సూచించారు. సొంతంగా సంస్థలు ఏర్పాటు చేసి ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి విద్యార్థులు చేరుకోవాలని ఆయన సూచించారు. తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకుని, అందులో ఉన్నత స్థానాన్ని అందుకోవడానికి విద్యార్థులు ప్రయత్నించాలని బాలక్రిష్ణారెడ్డి సూచించారు. ఆకాశ్ క్షిపణి సృష్టికర్త డా.ప్రహ్లాద రామారావు మాట్లాడుతూ, ఇంజనీరింగ్ విద్యార్థులు రక్షణ రంగంలోని అవకాశాలను సైతం అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఓయూ ఎగ్జామినేషన్ కంట్రోలర్ ప్రొఫెసర్ శశికాంత్, మాతృశ్రీ విద్యా సంస్థల చైర్మన్ డా.వీవీఆర్ కశ్యప్, కార్యదర్శి డా. కేపీ శ్రీనివాసరావు, కోశాధికారి సుధాకర్, సంయుక్త కార్యదర్శి సూర్యప్రభాకర్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.కామేశ్వరరావు, సీనియర్ డీన్ సీపీ వర్ధని, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేస్తున్న బాలక్రిష్ణారెడ్డి

గ్రూప్-1 ఫలితాలపై హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

పంజాగుట్ట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ఫలితాలపై హైకోర్టు తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని పలువురు నిరుద్యోగులు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతే స్థానిక ఎన్నికల్లో తమ సత్తా ఏమిటో కాంగ్రెస్ ప్రభుత్వానికి చూపుతామని హెచ్చరించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో 'రెండు లక్షల ఉద్యోగాల సాధన కోసం నిరుద్యోగుల పోరుబాట' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. జేఏసీ అధ్యక్షుడు మోతీలాల్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగులు పాల్గొని మాట్లాడారు. ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చినా నోటిఫికేషన్లు ఎందుకు ఇవ్వడం లేదని, ఖాళీలు ఎందుకు భర్తీ చేయడం లేదని వారు ప్రశ్నించారు. నిరుద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. నిరుద్యోగ యువత మీద రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని మండిపడ్డారు. ఉద్యోగాల కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఝాన్సీ, రవి, రాజు, కృష్ణమూర్తి, ఉమ, గోపీచంద్, హుస్సేన్, పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ప్రతినిధులు, నిరుద్యోగులు

పద్మశాలీలు ఐక్యతతో రాణించాలి: రూపాసదాశివ్

మన్సూరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పద్మశాలీలు ఐక్యతతో అన్ని రంగాలలో రాణించాలని పద్మశాలి సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు గుంటక రూపాసదాశివ్ సూచించారు. పాలాది పరమేశ్వర్ వృద్ధాశ్రమంలో మంగళవారం ఎల్బీనగర్ సర్కిల్ మహిళా నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారాన్ని నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు పున్న గణేష్‌నేత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంఘం రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు గుంటక రూపాసదాశివ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలు పోరండ్ల శారద, అఖిల భారత పద్మశాలి అన్నసత్రాల మార్గదర్శకులు కాశీనాథ్‌లు హాజరై నూతన కమిటీచే ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం పద్మశాలీ దసరామేళా చైర్మన్ కొకుంట్ల రవితేజ అక్టోబర్ 12న నిర్వహించే 23వ పద్మశాలీ దసరా మేళా బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు శ్రవణ్, సత్యం, అంజయ్య, సుధాకర్, రాంప్రకాష్, తులసీదాసు, రమేష్, లక్ష్మీనారాయణ, విశ్వేశ్వర్, సూర్యకాంత్, రవీందర్, జగన్నాథం, శ్రీనివాస్, గోపాల్, మహిళా విభాగం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పద్మశాలీ దసరామేళా బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

గాయత్రీహిల్స్‌లో రోడ్డు పనులు ప్రారంభం

సరూర్‌నగర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ 19వ డివిజన్‌లోని గాయత్రీహిల్స్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ అధికారులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజేందర్‌రెడ్డి రోడ్డు పనులను పరిశీలించారు. రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలని వారు కాంట్రాక్టర్, అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమేశ్‌గౌడ్, శ్రీనివాస్, గిరిముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో బూజుపట్టిన ప్రసాదం

● ఆగ్రహం వ్యక్తం చేసిన భక్తులు

చంపాపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో భక్తులకు అందించే ప్రసాదంలో బూజు ప్రత్యక్షం కావడం కలకలం సృష్టించింది. హస్తినాపురం డివిజన్‌కు చెందిన ఓ భక్తుడు మంగళవారం స్వామి వారిని దర్శించుకున్నాడు. అనంతరం స్వామి వారి పులిహోర ప్రసాదాన్ని కొనుగోలు చేశాడు. ఇంటికి వెళ్లి ప్రసాదం తినడానికి విప్పి చూడగా పులిహోర బూజు పట్టి ఉంది. దీంతో ఖంగుతిన్న ఆయన బూజు పట్టిన పులిహోరను ఫొటో తీసి ఆలయ ధర్మకర్తలకు పంపించారు. అనంతరం వారిని భక్తుడు ప్రశ్నించగా ఆలయ సిబ్బంది పొంతనలేని సమాధానాలు చెప్పారు. భక్తులకు నాణ్యమైన ప్రసాదం అందించాల్సిన బాధ్యత ఆలయ ఈఓ, సిబ్బందిపై ఉందని ధర్మకర్తలు పేర్కొన్నారు. సంఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ధర్మకర్తలు దేవాదాయ, ధర్మాదాయశాఖ అధికారులను కోరుతున్నారు. ఈ విషయంపై ఆలయ ఈఓ లావణ్యను వివరణ కోరగా తాను మంగళవారం ప్రత్యేక సెలవులో ఉన్నట్లు పేర్కొన్నారు. పులిహోర బూజుపట్టి ఉన్న ఫొటోను కొందరు తనకు వాట్సాప్‌లో పంపించారని, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నట్లు ఆమె తెలిపారు.



బూజుపట్టిన పులిహోర ప్రసాదం

అక్రమ వసూళ్లకు పాల్పడిన ఇద్దరి అరెస్ట్

● పరారీలో మరో నిందితుడు

మన్సూరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులమని చెప్పుకుంటూ అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరిని నాగోల్ పోలీసులు అరెస్టు చేశారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడని వారు తెలిపారు. నాగోల్ సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపిన వివరాల ప్రకారం.. గడ్డిఅన్నారంకు చెందిన రాచకొండ సతీష్(32), శ్యామకూరి శివగౌడ్(36), నల్లగొండ జిల్లా దేవరకొండకు చెందిన దామెర నాగఫణీంద్ర ముగ్గురు ప్రైవేటు ఉద్యోగంతో పాటు ఓ న్యూస్ చానల్, పత్రికలో రిపోర్టర్లుగా పనిచేస్తున్నారు. సులభంగా డబ్బులు సంపాదించాలనే దురుద్దేశంతో ఈ ముగ్గురు నకిలీ రెవెన్యూ అధికారుల అవతారమెత్తి అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో నాగోల్ ఫత్తుల్లాగూడలో ఏప్రిల్ 19న పవ అనే వ్యక్తి తన ప్లాటులో బోరు వేస్తుండగా.. నిందితులు ముగ్గురు అతణ్ని బెదిరించారు. రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేయగా అతను రూ.12వేలు గూగుల్‌పే ద్వారా డబ్బులను చెల్లించాడు. విషయాన్ని బాధితుడు ఉప్పల్ మండల తహసీల్దార్‌కు తెలియజేయగా వెంటనే ఆమె నాగోల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేయగా ముగ్గురు నిందితుల్లో సతీష్, శివగౌడ్‌లను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. మరో నిందితుడు నాగఫణీంద్ర పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడ్డ నిందితుల నుంచి రెండు ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

లడ్డూ.. అధరహో!

చాదర్‌ఘాట్/ చంపాపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గణపయ్య లడ్డూలు వేలం పాటలో అధిక ధరలు పలికాయి. వినాయకుడి చేతిలోని లడ్డూను కొనుగోలు చేసేందుకు చాదర్‌ఘాట్, చంపాపేట భక్తులు ఉత్సాహం చూపారు. సోమవారం రాత్రి లక్షలు వెచ్చించి లడ్డూలు కొనుగోలు చేశారు.



చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని ఫర్ ది పీపుల్ యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో వేలంలో గణనాథుని లడ్డూను రూ.1.22లక్షలకు దక్కించుకున్న గుమ్మిడి జైపాల్‌రెడ్డి



గడ్డిఅన్నారంలో మడిగల మహేందర్‌రెడ్డి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేశుడి లడ్డూను వేలంలో రూ.2.35లక్షలకు సొంతం చేసుకున్న పెద్దపులి సుఖానంద్ యాదవ్‌తో మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్‌రెడ్డి



సలీంనగర్‌లోని గణనాథుడికి హన్మంత్‌రావు, శ్రీనివాస్, ఆనంద్ దంపతులు సోమవారం రాత్రి 50రకాల ప్రసాదాలను సమర్పించారు. మలక్‌పేట ఏసీపీ సుబ్బిరామిరెడ్డి, సీఐ నరేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.